క్లుప్తంగా

సీతారామ స్వామి వార్లకు జలాభిషేకం



పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామం సంజీవయ్యనగర్‌లో వేంచేసిన లక్ష్మణ, హనుమత్ శ్రీసీతారామస్వామివార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఉదయం స్వామి వార్లకు విశ్వక్సేన పూజ, 108 మంది మహిళలతో స్వామివార్లకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం హోమం, గ్రామోత్సవం ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం 7.28 గంటలకు శ్రీలక్ష్మణ్ హనుమత్ శ్రీసీతారామ స్వామివార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠ, శాంతి కల్యాణం జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులకు ఉదయం 11 గంటలకు అన్న సమారాధన చేస్తామని పేర్కొంది.

జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం



పెనమలూరు: మండల పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జగనన్న విద్యా కానుక కిట్లను సిద్ధం చేశామని ఎంఈఓ కనకమహాలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలో నాలుగు క్లస్టర్ల పరిధిలో ఉన్న 37 పాఠశాలల్లో 6,134 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. వారిలో 2,932 మంది బాలురు, 3,202 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు సరఫరా చేశామన్నారు. కిట్లు సోమవారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేస్తామని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

విద్యార్థులకు బహుమతులు



పెనమలూరు: మండలంలోని వణుకూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగయటంతో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ పాఠశాలలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చెక్కా గోపీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయాల్లో 35 రోజుల వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖరరావు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్, వివిధ పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని లత తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి విశేష పూజలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మన క్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని, స్వామివారిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై స్వామి వారి పంచలోహ విగ్రహానికి అష్టోత్తర శతకలశాలతో విశేష పూజలు, నారికేళ జలంతో అభిషేకాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



కంకిపాడు: గ్రంథాలయాలతో విజ్ఞానం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కంకిపాడు, తెన్నేరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. మే ఎనిమిది నుంచి ఆదివారం వరకు ఈ శిబిరాలను కొనసాగించారు. పుస్తక పఠనం, క్యారమ్స్, చెస్, కథల పోటీలు, నృత్య పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. తెన్నేరు గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చరిత స్కూల్ హెచ్ఎం వేదాంతం వేదవతి తాయారు, గ్రంథాలయాధికారి ఎస్.సునీత పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కంకిపాడు గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

కళ్లెదుటే ఆనందాల లోగిళ్లు

- పేదల సొంతింటి కల సాకారం
- బాపులపాడు జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం



బాపులపాడులోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంతో పల్లెల స్వరూపం మారుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమవుతోంది. ఈ కాలనీల్లో ఇళ్ల నిర్మాణంతో కొత్త ఊళ్లు సాక్షాత్కరించబోతున్నాయి. కళ్లదుటే ఆనంద లోగిళ్లను చూసి పేదల మోము వికసిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో గన్నవరం నియోజకవర్గంలోని బాపులమండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

సరికొత్త ఊళ్లు

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్మిస్తున్న జగనన్న కాలనీలు సరికొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్ల స్థలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. బాపులపాడు మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క సెంట భూమి కూడా నిరుపేదలకు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి నివేశనా స్థలాల మంజూరు కోసం ఎదురుచూసిన గత ప్రభుత్వంలో నిరాశే మిగిలింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కలిపి దాదాపు 15 వేల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. బాపులపాడు మండలంలో 3,315 మందికి నివేశన స్థలాలు మంజూరు చేయగా, ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం సుమారు 95 ఎకరాల భూములు కొనుగోలు చేసింది. ప్రస్తుతం మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

బాపులపాడు మండలంలో..
మొత్తం లే అవుట్‌లు: 29
ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమి: 95.25 ఎకరాలు
కేటాయించిన ప్రభుత్వ భూమి: 48.23 ఎకరాలు
ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం భూ కొనుగోలుకు చేసిన వ్యయం: 60 కోట్లు
లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు: 3,315
మంజూరైన ఇళ్లు: 2,613
ఇంకా నిర్మాణం ప్రారంభం కానివి: 34
బేస్‌మెంట్ లెవల్‌లో: 1,447
పునాది దశలో ఉన్న ఇళ్లు: 612
గోడలు పూర్తయిన ఇళ్లు: 102
స్లాబులు పూర్తయినవి: 46
ఇళ్లు పూర్తైనవి: 372
ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందించిన లబ్ధి: రూ.7.35 కోట్లు



ఈమె పేరు తుపాకుల అరుణ. బాపులపాడులోని మహాత్మాగాంధీ నగర్‌లో గత కొన్నేళ్లుగా అద్దెకు నివసిస్తోంది. ప్రస్తుతం జగనన్న కాలనీలో నివేశన స్థలం, హౌసింగ్ లోను మంజూరు కావటంతో సొంతిల్లు కట్టుకుంది. ఇంటి నిర్మాణం పూర్తి కావటంతో నెల రోజుల క్రితమే గృహప్రవేశం కూడా జరిగింది. ప్రస్తుతం జగనన్న కాలనీలోని కొత్త ఇంట్లోనే నివసిస్తున్నారు. రోజువారీ కూలీగా పని చేసుకునే అరుణ గతంలో అద్దె ఇంటికి ప్రతినెలా రూ.4 వేలు చెల్లించేది. ఇప్పుడు తన సొంతింటిలో ఆనందంగా ఉంటుంది. అరకొర వేతనాలతో జీవించే నేను సొంత ఇల్లు కట్టుకుంటానని కలలో కూడా ఊహించలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవతో స్వగృహ యోగం ఏర్పడిందని ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.



ఇతని పేరు మోటూరి బెనర్జీ. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామం. ఇతను వ్యవసాయ కూలీ. ఇతనికి సొంతిల్లు లేకపోవటంతో నానా ఇబ్బందులు పడ్డాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్నకాలనీలో ఇళ్ల స్థలం మంజూరు చేయటంతో పాటు గృహ నిర్మాణానికి కూడా రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి చకచకా ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలానికి ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని బెనర్జీ తెలిపారు. నాకు సొంతిల్లు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రుణం తీర్చుకోలేనిదని ఆనందం వ్యక్తం చేశారు.



ఈమె పేరు బోడుమూరు కమల, బాపులపాడు మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామం. ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేకపోవటంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటోంది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న మంజూరు కాలేదు. కూలి పనులు చేసి జీవనం సాగించే కమల కుటుంబానికి ఇంటి అద్దెలు భారంగా మారాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలం కేటాయించటంతో సొంతిల్లు నిర్మించుకున్నారు. ఇటీవలే గృహ ప్రవేశం కూడా జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మర్చిపోలేమంటూ బోడుమూరు కమల హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పార్థసారథిని పరామర్శించిన మంత్రులు



పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని మంత్రులు జోగి రమేష్, కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. పార్థసారథి గుండెకు శనివారం స్టెంట్ వేసిన విషయం విదితమే. మంత్రులు ఆస్పత్రికి వచ్చి పార్థసారథిని కలిసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు రక్షణనిధి, వి.వరప్రసాదరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, పలువురు నేతలు కూడా పార్థసారథిని పరామర్శించారు. పార్థసారథిని పరామర్శించేందుకు పలువురు నేతలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు తరలివచ్చారు. పార్థసారథి ఆరోగ్యం సంపూర్ణంగా ఉండటంతో సోమవారం డిశ్చార్జి చేయనున్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

విజయవాడరూరల్: మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల ప్రజా వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేసి పరిష్కారం పొందాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరు కావాలని సూచించారు.

తాగునీటి వనరులు మెరుగుపర్చేందుకు చర్యలు



పూడికతీత ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీ, నాయకులు

గన్నవరం: గన్నవరంలో పెరుగుతున్న గ్రామ జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. స్థానిక టాటా స్టీల్ యార్డు సమీపంలోని పానకాల చెరువులో చేపట్టిన పూడికతీత పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీమోహన్ మాట్లాడుతూ.. గన్నవరం గ్రామంలో పెరుగుతున్న అపార్టుమెంట్లు, భవన నిర్మాణాలతో వేగంగా విస్తరిస్తోందన్నారు. అందుకు తగ్గట్లుగా బోర్‌వెల్స్ ద్వారా నీటి సరఫరా చేయడం గ్రామ పంచాయతీకి విద్యుత్ బిల్లులు భారంగా మారిందని చెప్పారు. పెరిగిన తాగునీటి అవసరాలను తీర్చేందుకు పానకాల చెరువులో పూడికలు తొలగించి పోలవరం నీటితో నింపుతామన్నారు. పూడికలు తీసిన మట్టిని గన్నవరంతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు, జగనన్న లేఅవుట్ లబ్ధిదారులు ఇళ్ల మెరక, ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాలని కోరారు. స్థానిక తొండగుంట, ఊర చెరువుల్లో కూడా పూడికలు తొలగించి మర్ల చెరువు ద్వారా పోలవరం నీటిని తరలించి తాగునీటి అవసరాలకు వినియోగించే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పానకాల చెరువులో సాగు పట్టాలు పొందిన లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ భూములు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, మండల అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు డొక్కు వెంకన్నబాబు, కంచర్ల చిన్నా, పీఏసీఎస్ అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ, పార్టీ నాయకులు సర్నాల ఆంజనేయులు, కాసరనేని రంగబాబు, మేచినేని బాబు, కంభంపాటి బోస్, కై లే శివకుమార్, మేడసాని రామకృష్ణ, సూరెడ్డి మణిమ్మ, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



గన్నవరం బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు



ఉంగుటూరులో బహుమతులు అందజేస్తున్న దాత రామ్మోహన్‌రావు



విజేతలతో జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, కృపానందం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కుటుంబరాజు తదితరులు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తక సంపదను విద్యార్థులను సద్వినియోగం చేసుకుని విజ్ఞాన సముపార్జన చేసుకోవాలని తెలిపారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, రోటరీక్లబ్ అధ్యక్షులు చిమట రామారావు విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆవుటపల్లి పార్థసారథి, రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ కంభంపాటి ధర్మారావు, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి దొండపాటి బాబురావు, ఎం.రామచంద్రరాజు, బీడీఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మండలంలో తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ గ్రామాల్లోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో గత 35 రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఆట పాటలతో ఉల్లాసంగా జరిగిన శిక్షణా తరగతుల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉంగుటూరులో గ్రంథాలయ భవన నిర్మాణ దాత రామ్మోహన్‌రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ స్వర్ణలత, హిందీ పండిట్ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచిన శిబిరాలు

గన్నవరంరూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత మరింత పెరిగిందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వేసవిలో విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, టీవీలకు దగ్గర కాకుండా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారన్నారు. శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవటం అభినందనీయమన్నారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అన్నే కనకదుర్గ, దామోదర గణపతిరావు, లైబ్రేరియన్ కె.కృపానందం పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

ఉయ్యూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఉయ్యూరు పట్టణంలోని ఏసీ గ్రంథాలయం, కాటూరు గ్రంథాలయాల్లో ముగింపు వేడుకలు నిర్వహించారు. ఉయ్యూరు గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. దళిత ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పినమాల నాగకుమార్, గ్రంథాలయాధికారి రమణి, సిబ్బంది స్రవంతి, సోని పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన లాము మల్లేశ్వరికి చెందిన పూరింటిలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ఆమె ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఇరుగుపొరుగు వాళ్లు మంటలను గుర్తించి ఆర్పేందుకు యత్నించారు. అక్కడే ఉన్న వలంటీర్ కాట్రు రఘు మిత్రులతో కలిసి మంటలు పక్క ఇళ్లకు వ్యాప్తించకుండా అప్రమత్తం చేశారు. హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని గృహోపకరణాలు, విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధం కావటంతో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ మోహనరావు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు. అగ్నిప్రమాద సహాయక చర్యల్లో సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ పాల్గొని, బాధితురాలు లాము మల్లేశ్వరిని పరామర్శించారు.

జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన మౌలిక సదుపాయాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులను చేర్చాలని కోరుతూ బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. హెచ్ఎం తోట వెంకట నాగేశ్వరరావు నేతృత్వంలో ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించారు. బడి ఈడు పిల్లలు కలిగిన తల్లిదండ్రులను కలిసి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పథకాలను వివరించారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్య అందిస్తున్నామని చెప్పారు. సువిశాల ప్రాంగణంలో సకల సదుపాయాలతో తరగతి గదులు, ఉన్నత విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూం ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు వివరించారు. మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యాకానుక, బైజూస్ ట్యాబ్, అమ్మ ఒడి వంటి పథకాలు విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. దీంతో పలువురు విద్యార్థులకు కొత్తగా అడ్మిషన్లు అందించారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవాలు



ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయ ధ్వజస్తంభం జీర్ణావస్థకు చేరుకోవటంతో ఆగమశాస్త్ర ప్రకారం నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ చేపట్టేందుకు యలమంచిలి కృష్ణామూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాద శర్మ, కుందుర్తి సీతారామయ్య సారథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణలతో వాస్తు పూజ, వాస్తు హోమం, త్రికుండాత్మక మూలమంత్ర హోమం, శాంతి హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ధ్వజస్తంభాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం 7.29 గంటలకు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ, అనంతరం శాంతి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి ఈ సందర్భంగా తెలిపారు.

ఇంటీరియర్ వర్క్ పేరిట మోసం

పెనమలూరు: నూతన భవనంలో ఇంటీరియర్ వర్క్ చేస్తానని రూ.25 లక్షలు తీసుకుని మోసగించిన మహిళపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. కానూరులో గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ నంబర్ 302ను డాక్టర్ జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ కొనుగోలు చేశారు. ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైన్ వర్క్‌ను రూ.35 లక్షలకు ఎస్ఆర్‌కే ఇన్నోవేటివ్ ఇంటీరియర్స్ యజమాని కళారాణి కుదుర్చుకున్నారు. ఆమె మాటలు నిమ్మన జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ పలు దఫాలుగా రూ.25 లక్షలు ఇచ్చారు. అయితే కళారాణి నాణ్యత లేని పనులు చేయటమే కాకుండా సకాలంలో పూర్తి చేయలేదు. ఆమెకు జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. గత ఫిబ్రవరిలో కొందరు వ్యక్తులతో కళారాణి వచ్చి తాను ఇక పనులు చేయబోనంటూ జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్‌ను బెదిరించింది. కళారాణి ఒప్పుకున్న వర్క్‌ను చేయకపోవటంతో తమను నమ్మించి మోసం చేసి సొమ్ము తీసుకుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రామ్మోహన్ గ్రంథాలయంలో ముగిసిన పుస్తక వితరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పుస్తక వితరణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. 1100 మంది పుస్తక ప్రియులు, విద్యార్థులకు మొత్తం 5500 పుస్తకాలు పంపిణీ చేశారు. ముగింపు సందర్భంగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక ప్రియుల కోసం గ్రంథాలయంలో పుస్తక వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. 400 మందికి పైగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో వచ్చి బాలల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం, పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు తీసుకెళ్లారన్నారు. ఆధ్యాత్మిక పుస్తకాలు పుస్తక ప్రియులను ఆకర్షించాయన్నారు.ఈ మూడు రోజులు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు విశిష్ట సేవలు అందించారన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కంకిపాడు: ఐదుగురు జూదరులను కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని పంట పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై దాడి చేయగా ఐదుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.1010 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై కంకిపాడు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని మారేడుమాక ఎస్సీ కాలనీ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు పందెంరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద రూ.10,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నేటి నుంచి ఉపాధ్యాయులు విధిగా హాజరుకావాలి

నున్న(విజయవాడరూరల్): వేసవి సెలవులనంతరం సోమవారం నుంచి స్కూల్ ప్రారంభం అవుతున్న క్రమంలో ఉపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని నున్న జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి తెలిపారు. హైస్కూల్ నుంచి వివిధ ప్రాంతాలకు 10 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో 10 మంది స్కూల్ అసిస్టెంట్లు రానున్నారు. వారిలో ఇంగ్లిషు ముగ్గురు, మ్యాథ్స్ ఇద్దరు, పీఎస్ ఇద్దరు, ఎన్ఎస్ ఒకరు, సోషల్ ఒకరు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒకరు చొప్పున ఉపాధ్యాయులు ఆదివారం జాయినింగ్ రిపోర్టు అందజేశారు. వారితో హెచ్ఎం సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న జగనన్న విద్యా కానుక కార్యక్రమం ఉన్నందున తప్పకుండా విధులకు హాజరుకావాలని తెలిపారు.

దుర్గమ్మ సేవలో కమలానంద భారతీ స్వామీజీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):గన్నవరంలోని భువనేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతి కమలానంద భారతీ స్వామీజీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామీజీకి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు స్వామీజీకి వేదస్వస్తి పలికారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందచేయగా, స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు.